క్లుప్తంగా

వాహనాల తనిఖీ

చిన్నమండెం: మండల కేంద్రంలోని బస్టాండ్ సర్కిల్‌లో శనివారం వాహనాలను సిఐ లింగప్ప, ఎస్‌ఐ రమేష్ బాబులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిఐ లింగప్ప మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని, అలాగే ఫోర్ వీలర్ వాహనదారులు తప్పనిసరిగా సీటు బెల్టు వాడాలని సూచించారు. అలాగే వాహనాలకు ఇన్సూరెన్సు చేయించుకోవాలని లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ అంజిరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

రామాపురం: మండలంలోని వికలాంగులకు కంటి వైద్య నిపుణులు డాక్టర్ రెడ్డన్న చేయూత అందించారు. శనివారం మండలంలోని మేదరపల్లె ఉడువారిపల్లెలో వికలాంగులకు తనవంతుగా ప్రతి నెల ఒక్కొక్కరికి రూ.300 చొప్పున 12 మందికి ఆరు నెలల పాటు ఆర్థిక సాయం అందిస్తానని ప్రకటించారు. ప్రతి నెలా 5వ తేదీలోపు ఇంటికి వచ్చి అందజేస్తామన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

ఒంటిమిట్ట: మండల పరిధిలోని ఇబ్రహింపేట పంచాయతీ, ఓబులేసు కోన వద్ద శనివారం పేకాట స్థావరాలపై పోలీసులు దాడి చేశారు. ఎస్‌ఐ మధుసూదన్ రావు మాట్లాడుతూ తమకు వచ్చిన ఖచ్చితమైన సమాచారంతో ఓబులేసు కోన వద్ద పేకాట ఆడుతున్న స్థావరాలపై దాడులు చేశామని, ఆ దాడుల్లో 6 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. రూ.5,300 స్వాధీనం చేసుకున్నామన్నారు. దీనిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

క్రీడల్లో గెలుపు ఓటములు సమానమే

రామాపురం : క్రీడల్లో గెలుపు ఓటములు సమానమేనని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాచపల్లె గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా క్రికెట్ టోర్నమెంట్‌లో శనివారం ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన విన్నర్, రన్నర్లకు బహుమతులు ఆయన అందజేశారు. విన్నర్ గంగనేరు వడ్డెపల్లె, రన్నర్‌గా నల్లగుట్టపల్లె టీంలుగా నిలిచాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సర్పంచ్ వెంకటరెడ్డి, పెద్దిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, వెంకట్రాజు, చలామారెడ్డి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

కోడిపందెం రాయుళ్లు అరెస్టు

వీరబల్లి: మండల పరిధిలోని గడికోట గ్రామంలో శనివారం కోడిపందెం ఆడుతున్న 9 మంది కోడిపందెం రాయుళ్లను అరెస్టు చేసి వారివద్ద నుంచి రూ. 4300 నగదును, 3 కోళ్లను స్వాధీనం చేసుకొన్నామని ఎస్‌ఐ రహీముల్లా తెలిపారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు ఆయన తెలిపారు.
ఓబులవారిపల్లి: ఓబులవారిపల్లె మండలం, బాలిరెడ్డిపల్లె గ్రామ సమీపంలోని ముళ్ల పొదల్లో కోడిపందెం ఆడుతున్న ఐదు మందిని శనివారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. మూడు పందెం కోళ్లు, రూ. 5350 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

క్రికెట్ పోటీలు

పెనగలూరు: ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలలో పెనగలూరు కొత్తపల్లి జట్టు సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. శనివారం సాతుపల్లి–కొత్తపల్లి జట్లమధ్య జరిగిన పోటీలలో కొత్తపల్లి జట్టు సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. సంక్రాంతి సెలవులు కావడంతో క్రికెట్ మ్యాచ్‌ను తిలకించేందుకు క్రికెట్ అభిమానులు భారీగా హాజరయ్యారు. చిన్న వెంగల్ రెడ్డి ఛారిటబుల్ ట్రస్టు ద్వారా ఏర్పాటు చేసిన ఈ టోర్నమెంట్‌కు ప్రైజ్ మనీ రూ. 1 లక్ష కావడంతో ఈ టోర్నమెంట్‌కు విశేష స్పందన లభించింది. ఆదివారం సెమీ ఫైనల్స్ జరగనున్నట్లు టోర్నమెంట్ సభ్యులు తెలిపారు.

సిద్దవటం: తెల్లవారుజామున భోగి మంటలు వేస్తున్న దృశ్యం



ఘనంగా భోగి

పల్లె సీమల్లో సంక్రాంతి సంబరాలు ఉల్లాసంగా .. ఉత్సాహంగా సాగుతున్నాయి. అన్ని గ్రామాలలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని భోగి పండుగను అత్యంత వేడుకగా నిర్వహించారు. చలి తీవ్రత ఉన్నా తెల్లవారుజామునే లేచి భోగి మంటలు వేశారు.



నందలూరు: ముగ్గుల పోటీలను వీక్షిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి



రాయచోటి టౌన్: పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రామాపురం : అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి శాసనసభ్యుడు గడికోట శ్రీకాంత్‌రెడ్డి భోగి పండుగను తన నివాసమైన రామాపురం మండలం సుద్దమళ్ల గ్రామం ఎర్రంరెడ్డిగారిపల్లెలో కుటుంబ సభ్యులతో కలిసి వైభవంగా జరుపుకున్నారు. ఉదయాన్నే భోగి మంటల కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి , చిన్నాన గడికోట వేదమూర్తిరెడ్డి (అమెరికా వైద్యులు) తన సోదరులతో కలిసి జరుపుకున్నారు. ఎన్నో సంవత్సరాల తరువాత తన చిన్నాన వేదమూర్తిరెడ్డి తన సొంత ఊరుకు రావడంతో మండలంలోని చుట్టు పక్కల ప్రజలకు పండుగ వాతావరణం నెలకొంది. ఆయనను చూసేందుకు మండలంలోని ప్రజలు తరలివచ్చారు. తన కోసం వచ్చిన ప్రజలను, నాయకులను ఆప్యాయంగా పలకరించారు. ప్రజలకు అన్నదానం చేశారు.

2 వేల కుటుంబాలకు దుస్తులు పంపిణీ

ఎమ్మెల్యే కుటుంబాన్ని కలిసేందుకు వచ్చిన ప్రజలకు అన్నదానంతో పాటు 2వేల కుటుంబాలకు ఎమ్మె ల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తన చిన్నాన వేదమూర్తి రెడ్డి తన తండ్రి మోహన్‌రెడ్డిల చేతులు మీదుగా దుస్తులు పంపిణీ చేశారు.

నందలూరు (రాజంపేట): మేడా ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నాగిరెడ్డిపల్లె పంచాయతీ సర్కిల్‌లో జిల్లా స్థాయి ముగ్గుల పోటీలను నిర్వహించారు. శనివారం రాత్రి ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి చేతుల మీదుగా విజేతలకు బహుమతులను, నగదు, బిందెలను అందచేశారు. ప్రథమ బహుమతి రూ. 10వేలు, రెండవది రూ. 7వేలు, మూడవ బహుమతి రూ. 5 వేలు అందజేశారు. ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి , జడ్పీటీసీ గడికోట ఉషాసుబ్బారెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు సెక్రటరీ సయ్యద్ అమీర్, నాగిరెడ్డిపల్లె సర్పంచి జంబు సూర్యనారాయణ, మండల ఉపాధ్యక్షులు అనుదీప్, తుమ్మల భావన శ్రీధర్, కో–ఆప్షన్ సభ్యుడు కలీం, టీసీ నేత హిమగిరి యాదవ్, దళిత నేత ఆర్ముగం విశ్వనాథ్ పాల్గొన్నారు.

రాజంపేట టౌన్: అన్ని ప్రాంతాల్లో భోగి పండుగ సందడి నెలకొంది. అనేక మంది భోగి మంటల్లో నీళ్ళు కాచుకొని స్నానాలు ఆచరించారు. ఇదిలావుంటే భోగి పండుగ రోజు అనేక మంది ఉదయం మాంసాహారంతోనే టిఫిన్ తింటారు. అయితే శనివారం కావడంతో ప్రజలు మాంసాహారం ముట్టుకోలేదు. ఫలితంగా చికెన్, మటన్ దుకాణాలు వెలవెలబోయాయి.

లక్కిరెడ్డిపల్లె : సంక్రాంతి నేపథ్యంలో శనివారం భోగి వేడుక ఘనంగా జరుపుకున్నారు. వేకువజామున లేచి చిన్నారులు, పెద్దలు ఇళ్లలోని పనికిరాని వస్తువులను తీసుకువచ్చి భోగి మంటలు వేశారు. ఇళ్ల ముందర రంగవల్లులతో గొబ్బెమ్మలను ఏర్పాటు చేశారు. చిన్న పిల్లలకు భోగిపళ్లు పోసి కొత్త దుస్తులను ధరింపచేశారు. మహిళలు సాంప్రదాయ పట్టు వస్త్రాలు ధరించి అందరినీ అలరించారు. భక్తులు పలు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువకులు వివిధ క్రీడాపోటీలలో పాల్గొని ఉత్సాహంగా గడిపారు.

పెనగలూరు: మండలంలో వాడవాడలా భోగి పండుగ సంబరాలను అత్యంత ఘనంగా నిర్వహించుకున్నారు. తెలుగు ప్రజలకు భోగి పండుగ ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. ప్రతి ముంగిట ముందు తెల్లవారుజామునే భోగి మంటలు వేసి సంబరాలు జరుపుకుంటారు. ప్రతి ఇంట్లో పిండి పదార్థాలు, నూతన వస్త్రాలు ధరించి కుటుంబ సమేతంగా ఈ పండుగను అత్యంత ఘనంగా ప్రజలు జరుపుకున్నారు.

పుల్లంపేట: సంక్రాంతి పర్వదినంలో భాగంగా శనివారం భోగి సంబరాలు ఘనంగా జరిగాయి. పుల్లంపేట మండల ప్రజలు ప్రతి ఇంటి ముంగిట భోగి మంటలు వేసి ఆ మంటలలో నీటిని కాచుకొని తలంటు స్నానాలు ఆచరించారు.

సంబేపల్లె : మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి సంబరాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పండుగలో భాగంగా పలు గ్రామాల్లో పశువులను ప్రత్యేకంగా అలకరణలో ముస్తాబు చేసి ప్రత్యేక పూజల అనంతరం చిట్లాకుప్పల వద్ద ఏర్పాటు చేసిన భోగి మంటలలో పశువులను బెదిరించి పండుగను కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకుంటున్నారు.

గాలివీడు: మండలంలో సంక్రాంతి సందర్భంగా గ్రామాలలో భోగి మంటలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి జల్లా సుదర్శన్ రెడ్డి భోగి మంటల సంబరాలలో పాల్గొని భోగి మంటలను ప్రారంభించారు.

రాయచోటి టౌన్ : సంక్రాంతి పండుగ సందర్భంగా చెన్నముక్కపల్లె సర్పంచ్ మమత, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసుల రెడ్డిలు 100 మందికి పేదలకు చీరెలు పంపిణీ చేశారు. శనివారం గ్రామ సచివాలయ ఆవరణలో గ్రామంలోని 100 మంది పేదలను ఎంపిక చేసి చీరెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు రామచంద్ర, పవన్, చిన్నప్ప రెడ్డి, ఉదయ్, అప్పడు తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం: సిద్దవటంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి మాజీ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ ఏకుల రాజేశ్వరిరెడ్డి బహుమతులను అందజేశారు. ఆమె మాట్లాడుతూ రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, సోదరుడు వైఎస్‌ఆర్‌సీపీ సిద్దవటం మండల ఇన్‌చార్జి మేడా మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీల్లో మొదటి విజేత బి. అనుజ్ఞ, రెండవ విజేత పి. హేమ, మూడవ విజేత ఎం. నిర్మలు నిలిచారన్నారు. వీరికి బహుమతులు ఇవ్వడంతో పాటు 10 మందికి కన్సొలేషన్ బహుమతులను అందజేశామన్నారు. పోటీలు నిర్వహించిన నిర్వాహకులు స్థానిక వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు ఎం. విజయవర్ధన్, బి. చిన్నబాబులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు రావుల సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



రామాపురం: భోగి వేడకలో గడికోట కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



లక్కిరెడ్డిపల్లె : భోగి వేడుకలలో ఎంపీపీ సుదర్శన్ రెడ్డి , ప్రజలు



సిద్దవటం: ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

బుజ్జాయి మురిసె



సంక్రాంతిని పురస్కరించుకొని శనివారం అనేక మంది భోగిపండ్ల వేడుకను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా చిన్నపిల్లలున్న తల్లులు ఇరుగుపొరుగున వున్న వారిని ఆహ్వానించి తమ పిల్లలపై రేగిపండ్లను పోయించారు. చిన్నపిల్లలున్న ఇళ్లల్లో భోగిపండ్ల వేడుక సందడి, సందడిగా జరిగింది. – రాజంపేట టౌన్

రంగవల్లి మెరిసె



సిద్దవటం గాంధీ వీధిలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. యువతులు, బాలికలు చాలా ఉత్సాహంగా తమ ప్రతిభను కనబరిచారు. పోటా పోటీగా రంగవల్లులను తీర్చిదిద్దారు. – సిద్దవటం

పశు అలంకరణ అదిరింది



సంక్రాంతి పండుగ అంటేనే అదో పెద్ద సంబరం. బంధుమిత్రులందరూ వస్తారు. ఈ సందర్భంగా పశువులను ప్రత్యేకంగా అలంకరిస్తారు. సంబేపల్లెలో ఈ తరహా అలంకరణ విశేషంగా ఆకట్టుకుంటోంది. – సంబేపల్లె

క్రీడాస్ఫూర్తి విరిసె



రామాపురం మండలంలో సంక్రాంతి వేడుకలలో భాగంగా క్రికెట్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు ఇచ్చారు. – రాయచోటి టౌన్

పేదల జీవితాల్లో ఆనందం నింపాలి



రాజంపేట రూరల్ : పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న కేకే రెడ్డి, విజయ కుమార్ రెడ్డి, రాజేంద్రనాథ్‌రెడ్డి, మానసా చిన్నపరెడ్డి తదితరులు



రాజంపేట టౌన్: మున్సిపల్ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేస్తున్న మేడా మల్లికార్జునరెడ్డి , ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, పోలా శ్రీనివాస్ రెడ్డి

రాజంపేట టౌన్: సంక్రాంతి ప్రజల మోముల్లో చిరునవ్వులు నింపాలని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు శనివారం పోలా శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో దుస్తులు, స్టీలు సామాన్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మేడా, ఆకేపాటి మాట్లాడారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మున్సిపల్ ఛైర్మన్ పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేయడం చిన్నస్థాయి సిబ్బంది పట్ల కూడా ఆయనకు ఉన్న అభిమానాన్ని తెలియచేస్తుందన్నారు. సంక్రాంతి పెద్ద పండుగ అని ప్రతి ఒక్కరు ఈ పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. పోలా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తనవంతు ఉడతాభక్తిగా చిరు సహాయం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ మర్రి రవి, కౌన్సిలర్లు న్యామతుల్లా, వైఎస్సార్ సీపీ నాయకులు డీలర్ సుబ్బరామిరెడ్డి, తోట లక్ష్మినారాయణ, గోవిందు బాలకృష్ణ పాల్గొన్నారు.

రాజంపేట రూరల్: పేదల జీవితాల్లో ఆనందం నింపాలనే లక్ష్యంతో ఎన్‌ఆర్‌ఐ కేకే రెడ్డి తన గ్రామంలో వంద కుటుంబాల వారికి దుస్తులు పంపిణీ చేయడం హర్షణీయమని వైఎస్సార్‌సీపీ నాయకులు గాలివీటి విజయకుమార్‌రెడ్డి(మదన్‌రెడ్డి), వీరబల్లి ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మానస కె.చిన్నపరెడ్డి ప్రశంసించారు. రాజంపేట మండలం పెద్దకారంపల్లెలో శనివారం కేకే రెడ్డి గ్రామంలోని పురుషులు, మహిళలు, పిల్లలకు ఇంటిల్లిపాదికి దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అతి పెద్ద పండుగ సంక్రాంతిని ప్రతి ఒక్కరూ ఆనందంగా జరుపుకోవాలనే సదుద్దేశంతో ప్రతి సంవత్సరం సొంత గ్రామంలో దుస్తులు పంపిణీ చేయడం గొప్ప సేవా కార్యక్రమమని కొనియాడారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇతర దేశాలలో జీవనం సాగిస్తున్న కేకే రెడ్డి ఇక్కడి ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ప్రతి సంవత్సరం సంక్రాంతికి సొంత గ్రామానికి విచ్చేసి దుస్తులు పంపిణీ చేయడం గొప్ప సేవా కార్యక్రమమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఈఓ మేడా చెంగల్‌రెడ్డి, రాజంపేట, కడప లయన్స్‌క్లబ్ అధ్యక్షులు వై.సుబ్రమణ్యంరాజు, డాక్టర్ రంగనాథరెడ్డి, ట్రెజరర్ నరసింహరాజు, మాజీ అధ్యక్షుడు ఏ వెంకట సుబ్బయ్య నాయుడు, నిర్వాహకులు ఎంవీ సుబ్బారెడ్డి, కె. శివరామిరెడ్డి, డి.సుబ్బారెడ్డి, కొండారెడ్డి, జగన్‌మోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.